విద్యుత్ సమస్యలు పరిష్కరించేలా ప్రణాళికలు

ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యుత్ సమస్యలు పరిష్కరించే దిశగా ప్రణాళికలు చేసినట్లు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. తేతలి ఎస్‌సి కాలనీలో సింగిల్ ఫేజ్ నుంచి త్రీఫేజ్‌కు మార్చడంతోపాటు రెండు 100 కెవి ట్రాన్స్‌ఫార్మర్లు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రాధాకృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నాయకుల నిర్లక్ష్యం కారణంగా తలెత్తిన విద్యుత్ సమస్యలను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దశల వారీగా విద్యుత్ లైన్లు త్రీఫేజ్‌కు మార్చి నిరంతరాయంగా విద్యుత్ సరఫరాను అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి విద్యుత్ శాఖను భ్రష్టు పట్టించారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇదేం తీరు..!

మెగా పిటిఎంకు విట్నెస్ అధికారులు

నియామకంపై ఉపాధ్యాయులు, నేతలు మండిపాటు

ఇప్పటికే అదనపు పనిభారంతో ఉపాధ్యాయులు సతమతం

మొక్కల పంపిణీని ఆన్‌లైన్ చేయడం బోధనేతర పని కాదా?

ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం తీరుపై సర్వత్రా విమర్శలు

ప్రజాశక్తి - భీమవరం

విద్యాబుద్ధులు నేర్పించే గురువుకు సవాలక్ష పనులు అప్పగించి ఘోరంగా అవమానిస్తున్నారు. పాఠ్యాంశాలు బోధనకు బదులు బోధనేతర పనులు చేయిస్తూ ఉపాధ్యాయ వృత్తి గౌరవాన్ని మంటగలుపుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలతో ఉపాధ్యాయ వృత్తి కత్తి మీద సాములా తయారైంది. ఈ నెల పదో తేదీన నిర్వహించతలపెట్టిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారింది. ఈ కార్యక్రమం ప్రత్యేక పరిశీలన నిమిత్తం విద్యాశాఖేతర ఉద్యోగులను విట్నెస్ అధికారులుగా నియామకం, ఇతర అదనపు పనులకు జారీ చేసిన ఉత్తర్వులపై ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి.

జిల్లాలో ఈ నెల 10న పండుగ వాతావరణంలో మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ (పిటిఎం 2.0) పెద్దఎత్తున నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. గతేడాది కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే పేరెంట్స్, టీచర్స్ మీట్ నిర్వహించారు. అయితే ఈ ఏడాది ప్రయివేటు పాఠశాలలతోపాటు ప్రభుత్వ, ప్రయివేటు జూనియర్ కళాశాలల్లో కూడా పిటిఎం సమావేశాలు నిర్వహించడానికి చురుగ్గా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 1,931 ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, 102 జూనియర్ కళాశాలల నుండి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి హాజరవ్వాలని విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఈ కార్యక్రమాలకు ప్రత్యేక పరిశీలన నిమిత్తం విద్యాశాఖేతర ఉద్యోగులను విట్నెస్ అధికారులుగా నియమించాలని పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు శనివారం జారీ చేసిన ఉత్తర్వులు వివాదాస్పదమవుతున్నాయి. ఈ ఆదేశాలతో టీచర్ల పనితీరును ఇతర శాఖల అధికారులు, ఉద్యోగుల వద్ద అపోహలకు, హేళనకు గురి చేసేనట్లుగా భావించాల్సి వస్తోందని పలు ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. పిటిఎం కార్యక్రమాలు సరిగా చేస్తున్నారో, లేదో గమనించడంతోపాటు, వాటిని వీడియో చిత్రాలు తీసి విట్నెస్ ఆఫీసర్లను చేయడానికి ప్రతి పాఠశాలకూ ఒక విట్నెస్ ఆఫీసర్‌ను నియమించాలని ఆదేశాలందాయి. దీనికి అనుగుణంగా విద్యాశాఖేతర ఉద్యోగిని విట్నెస్ ఆఫీసర్‌గా నియమించుకుని, వారి ఆధార్ నెంబరు, ఎంప్లాయి ఐడీ, సిఎఫ్ఎంఎస్ వివరాలు తదితర సమాచారం అంతటినీ స్ప్రెడ్ షీట్లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో విట్నెస్ ఆఫీసర్ కోసం స్థానికంగా విధులు నిర్వర్తించే ఉద్యోగులను ఎక్కువగాలో వాకబు చేసి, వారి సందేహాలను నివృత్తి చేయడం, ఒకవిధంగా బతిమాలడుకోవడం ప్రధానోపాధ్యాయుల వంతైందని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

ఆదరోజు అదనపు పని అవసరమా

తల్లి పేరుతో ఒక మొక్క నాటడం ఈ ఏడాది థీమ్‌గా విద్యాశాఖ తీసుకుంది. పాఠశాల ఆవరణలోగానీ, లేదా వారి ఇంటి వద్దగానీ మొక్క నాటేందుకు కార్యాచరణ రూపొందించింది. లీప్ యాప్‌లో లాగిన్ అయ్యి వారి పేరును నమోదు చేసి పెరుగుతున్న మొక్కను ప్రతి ఏడాది ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించింది. మొక్కల పంపిణీ ఉద్దేశం మంచిదే అయినప్పటికీ విద్యార్థుల ఇండివిడ్యువల్ ఫోన్ నెంబరు, డేట్ ఆఫ్ బర్త్ వంటి అంశాలు కూడా ఆన్‌లైన్ చేసి రిజిస్టర్ చేయాలంటూ పరిస్థితులు అనుకూలంతోపాటు సమయం, టెక్నాలజీ వంటి అనేక రకమైన సమస్యలు ఏర్పడే అవకాశం ఉంది. మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ రోజు మొక్కల పంపిణీ, ఆన్‌లైన్ పనులు ఎంతవరకు అవసరమో, సమంజసమో విద్యా శాఖాధికారులు, ప్రభుత్వ పెద్దలు ఆలోచించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

సవాలక్ష సమస్యలతో సతమతం

విద్యార్థులకు అందిస్తున్న బెల్టులు, బ్యాగులు వంటి వాటికి క్యూఆర్ కోడ్లు, ప్రతి వస్తువుపై విడిగా వేరు వేరు నెంబర్ ట్యాగ్‌లు ఇచ్చి ఎంటర్ చేయడంతోపాటు ఆన్‌లైన్ పని భారాన్ని విపరీతంగా పెంచారు. రోజువారీ అందించే మధ్యాహ్న భోజన పథకం ఇచ్చే రైస్ బ్యాగులపైనా ప్రత్యేకంగా కోడ్ నెంబర్లు ఇచ్చి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఒత్తిడికి గురి చేస్తున్నారు. పాఠశాల బడి వేళల అనంతరం ప్రత్యేక క్లాసులు అంటూ షెడ్యూల్ డిజైన్ చేసి దూర ప్రాంతాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పబ్లిక్ హాలిడేస్, ఆప్షనల్ హాలిడేస్ వంటి వాటిని ఐచ్ఛికంగా ఉపాధ్యాయులు కోరుకున్న విధంగా పొందడం ప్రభుత్వంపై వ్యతిరేకత మూటగట్టేలా నిర్ణయాలు జరుగుతున్నాయని ఉపాధ్యాయులు ఘంటాపథంగా చెబుతున్నారు.

అనాలోచిత నిర్ణయాలపై ఉద్యమం..

పెన్మెత్స సాయివర్మ, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి

మెగా పేరెంట్, టీచర్ సమావేశానికి, మొక్కలు నాటే కార్యక్రమానికి మేం వ్యతిరేకం కాదు. అయితే ప్రభుత్వం ఏదైనా నిర్ణయం చేపట్టేప్పుడు అధికారులతోపాటు ఉపాధ్యాయ సంఘాల నేతలతోనూ చర్చించి చేస్తే క్షేత్రస్థాయిలో ఇబ్బందులుండేవి ఉండవు. ఈ రకమైన విధానం విద్యాశాఖ నుండిగాని, ప్రస్తుత ప్రభుత్వం నుండిగాని లేదు. ఇది సరైంది కాదు. ఇదే విధానం భవిష్యత్తులో కొనసాగితే ప్రభుత్వ విద్యాశాఖ తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలపై ఉద్యమానికి కార్యాచరణ రూపొందిస్తాం.

విట్నెస్ అధికారి నియామక ఉత్తర్వులు రద్దు చేయాలి



పిఎస్.విజయరామరాజు, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు

సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఇచ్చిన విట్నెస్ అధికారి నియామక ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలి. పాఠశాలలు ప్రారంభమైన నెల రోజుల్లోనే యోగా పేరుతో వారం రోజులు, మెగా పిటిఎం పేరుతో మరో వారం రోజులు బోధనా సమయం హరించుకుపోయింది. ఒకవైపు విద్యార్థుల అవుట్‌పుట్ కోసం పర్యవేక్షణ అధికారులు వస్తారని చెబుతూ, మరోవైపు బోధనేతర కార్యక్రమాలు పెంచడం సరికాదు. తక్షణమే విద్యాశాఖ అధికారులు మెగా పిటిఎంలో విట్నెస్ అధికారిని నియమించుకోవాలని ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలి.

బోధన కుంటుపడే ప్రమాదం ఉంది

పివిఎస్ఎస్.రమణారావు, ఎపిటిఎఫ్ 1938, జిల్లా ప్రధాన కార్యదర్శి

మెగా పేరెంట్, టీచర్ సమావేశ నిర్వహణను ఆహ్వానిస్తున్నాం. అయితే ఈ మీటింగ్‌ల నిర్వహణ పేరిట యాప్‌లో ఉపాధ్యాయులచే సమాచారాన్ని అప్‌లోడ్ చేయించడాన్ని వ్యతిరేకిస్తున్నాం. దీనివల్ల ఉపాధ్యాయుల బోధన కుంటుపడుతోంది. దయచేసి ఇప్పటికైనా ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలి. ఇప్పటికే పని భారం ఎక్కువై ఉపాధ్యాయులు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో మరింత పని భారాన్ని మోపడం ఎంతవరకు న్యాయం.

మెమోరియల్ హాల్ స్థలం వద్ద నినాదాలు చేస్తున్న సాధన కమిటీ సభ్యులు

అల్లూరిని అవమానించకండి

అల్లూరి మెమోరియల్ హాల్‌ను పున:నిర్మించి గౌరవించండి

కేంద్ర మంత్రి శ్రీనివాస్‌వర్మ, ఎంపీ సత్యనారాయణ, మండలి ఛైర్మన్ మోషేన్‌రాజు, పిఎసి ఛైర్మన్ రామాంజనేయులుకు వినతులు అందజేత

ప్రజాప్రయోజనాలు పట్టవా: సాధన కమిటీ గౌరవాధ్యక్షులు సత్యనారాయణరాజు

మెమోరియల్ హాల్ పునర్‌నిర్మించకపోతే దశలవారీ పోరాటం: సాధన కమిటీ సభ్యులు బి.బలరాం

భవన నిర్మాణానికి కృషి: కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ

ప్రజాశక్తి - భీమవరం

తెలుగుజాతి ముద్దుబిడ్డ, పేరు, ప్రఖ్యాతులుగాంచిన అల్లూరి సీతారామరాజును ఆదర్శంగా తీసుకుని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని, అల్లూరి వారసులుగా ఉండాలి తప్ప అల్లూరిని అవమానించేలా ఉండకూడదని, అల్లూరి మెమోరియల్ హాలును పున:నిర్మించి గౌరవించండి అంటూ అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాలు పునర్నిర్మాణ సాధన కమిటీ ప్రజాప్రతినిధులకు రాయబారం చేసింది. స్థానిక పాత బస్టాండ్ వద్ద సాధన కమిటీ ఆధ్వర్యంలో అల్లూరి మెమోరియల్ హాలును పున:నిర్మించాలని కోరుతూ సాధన కమిటీ సోమవారం సమావేశమైంది. ఈ సందర్భంగా స్వాతంత్ర సమరయోదుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించింది. ఈ సందర్భంగా సాధన కమిటీ గౌరవాధ్యక్షులు కనుమూరి సత్యనారాయణరాజు మాట్లాడుతూ ఆనాడు విజ్ఞాపనల మేరకు ప్రభుత్వం స్వాతంత్ర సమరయోధుల పేరిట స్థలం కేటాయించిందన్నారు. అప్పట్లో అల్లూరి సత్యనారాయణ మంత్రిగా ఉండి భవనాన్ని నిర్మించారని గుర్తు చేశారు. ఈ హాలు ప్రజానీకానికి అనేక విధాలుగా ఉపయోగపడిందన్నారు. అయితే ప్రజాప్రయోజనాలను గాలికొదిలేశారని విమర్శించారు. తొలగించిన హాలును వెంటనే నిర్మించాలని కోరారు. సాధన కమిటీ సభ్యులు బి.బలరాం మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు స్మారక భవనం దశాబ్దాల తరబడి భీమవరం పరిసర గ్రామాల ప్రజలకు విశేషమైన సేవలందించందన్నారు. పేద, మధ్యతరగతి, వివాహాది శుభకార్యాలకు, కళా, సాంస్కృతిక, సేవ, ప్రభుత్వ కార్యక్రమాలకు ఎంతో ఉపయోగకరంగాను, నామమాత్రపు ధరతో అందరికీ వీలుగా ఉండేదని అన్నారు. భవనం పాడైందని కూలగొట్టి మళ్లీ భవనం నిర్మించలేదన్నారు. ఇక్కడున్న స్థలం చూస్తే పట్టణంలోని మురికి చెత్త అంతా ఈ స్థలంలోనే డంప్ చేయడమంటే విప్లవ వీరున్ని అవమానించినట్లేనన్నారు. ఈ భవనం తిరగి నిర్మాణం చేపట్టే వరకు సాధన కమిటీ ఆధ్వర్యంలో దశలవారీగా పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. సాధన కమిటీ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ స్వాతంత్ర సమర యోధులకు కేటాయించిన స్థలం అంటే ఇదొక పవిత్ర స్థలమని అన్నారు. ఈ రోడ్డులో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇక్కడకు వచ్చేసరికి గాలి పీల్చుకోలేనంత దుర్వాసన వెదజల్లుతుందంటే ఇక్కడ పరిస్థితి అర్థం చేసుకోవచ్చన్నారు. ఇదేనా మనం స్వాతంత్ర సమరయోధులకు ఇచ్చే గౌరవం అని ప్రశ్నించారు. ప్రధాని స్వయంగా వచ్చి అయన విగ్రహావిష్కరణ చేశారంటే భరతజాతి విముక్తికోసం ప్రాణాలు తృణప్రాయంగా అర్పించిన ఘనతను గుర్తించారన్నారు. అటువంటి వారి జ్ఞాపిక కోసం కేటాయించిన స్థలాన్ని ఈ విధంగా తయారు చేయడం ఏమాత్రం గౌరవప్రదం కాదని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం స్థల ప్రక్షాళన చేపట్టి భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. సాధన కమిటీ నాయకులు కంతేటి వెంకటరాజు, బి.వాసుదేవరావు, చెరుకువాడ రంగసాయి, సీతారాంప్రసాద్, దండు శ్రీనివాసరాజు మాట్లాడుతూ భీమవరం పట్టణంలో ప్రారంభం నుండి ఉండి అనేక సేవలు అందించిన ఈ హాలును పున:నిర్మించే వరకూ సాధన కమిటీ ఆధ్వర్యంలో కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. అనంతరం కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ, శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, పిఎసి ఛైర్మన్, స్థానిక ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు, డిఎన్ఆర్ కళాశాల కార్యదర్శి గాదిరాజు బాబులను సాధన కమిటీ సభ్యులు కలిసి వినతులు అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్‌వర్మ తక్షణం సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి భవన నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాధన కమిటీ సభ్యులు ఎం.వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, బొక్కా సత్యనారాయణ, జేమ్స్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మకు మెమోరాండం

శాసనమండలి ఛైర్మన్ కె.మోషేన్‌రాజుకు మెమోరాండం



పిఎసి ఛైర్మన్ అంజిబాబుకు మెమోరాండం అందిస్తూ..

ఇంజినీరింగ్ పరేషాన్..!

బిటెక్ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం

22న తొలివిడత సీట్ల కేటాయింపు

కోరుకున్న సీటు కోసం విద్యార్థుల్లో టెన్షన్

సిఎస్ఇ, ఇసిఇ, ఐటి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్‌లపైనే అంతా మొగ్గు

ఉమ్మడి జిల్లాలోని 14 ఇంజినీరింగ్ కాలేజీల్లో 14,663 సీట్లు

ఫీజుల భారంపై తల్లిదండ్రుల్లో ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఇంజినీరింగ్‌లో బిటెక్ సీట్ల కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం మొదలైంది. రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్ల ప్రక్రియను పూర్తి చేసి ఈ నెల 22వ తేదీన సీట్ల కేటాయింపు ప్రక్రియ జరగనుంది. దీంతో ఎపిఇఎపి సెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థుల్లో హడావుడి మొదలైంది. తాము కోరుకున్న కాలేజీలో, ఆశిస్తున్న బ్రాంచ్ వస్తుందో, లేదోనని విద్యార్థులు పరేషాన్ అవుతున్నారు. మరోపక్క ఇంజినీరింగ్‌లో హాస్టల్, ఇతర ఫీజుల కింద రూ.లక్షలు వెచ్చించాల్సి ఉండటంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అప్పుల కోసం ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేస్తున్న పరిస్థితి ఉంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 14 ఇంజినీరింగ్ కాలేజీలు ఉన్నాయి. వీటిలో 13,300 వరకూ సాధారణ సీట్లు, ఇడబ్ల్యూఎస్ కోటాలో 1300 సీట్లు మొత్తంగా 14,600 సీట్లు వరకూ ఉన్నాయి. జిల్లాలోని కాలేజీలతోపాటు రాష్ట్రంలోని ఇతర కాలేజీలనూ విద్యార్థులు ఎంచుకునే అవకాశం ఉంది. విద్యార్థులంతా ఎక్కువగా సాఫ్ట్‌వేర్ బ్రాంచ్‌లవైపు మొగ్గు చూపుతున్నారు. దీనిలో భాగంగా సిఎస్ఇ, ఇసిఇ, ఐటి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి బ్రాంచ్‌లవైపు విద్యార్థులు చూస్తున్నారు. ఈ ఏడాది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ సీట్ల కోసం విద్యార్థులు ఎక్కువగా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే చాలా కాలేజీలు మేనేజ్‌మెంట్ కోటాలో సీట్లను భర్తీ చేసుకున్న పరిస్థితి నెలకొంది. ఎంసెట్ ర్యాంకు ప్రకారం సీటు రాదని తెలిసిన వారంతా ఇప్పటికే మేనేజ్‌మెంట్ కోటాలో రూ.రెండు నుంచి రూ.నాలుగు లక్షల వరకూ డొనేషన్ కట్టి సీట్లు కొనుగోలు చేశారు. నిబంధనల ప్రకారం ఒక బ్రాంచ్‌కు సంబంధించి 60 సీట్లు ఉంటే వాటిలో 42 సీట్లు ఎపిఇఎపి సెట్ ర్యాంకు ఆధారంగా కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించి కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తారు. మిగిలిన 18 సీట్లను మేనేజ్‌మెంట్ కోటాలో డొనేషన్ కట్టించుకుని కేటాయిస్తారు. ఇప్పటికే మేనేజ్‌మెంట్ కోటా సీట్లను చాలావరకూ భర్తీ చేసిన పరిస్థితి ఉంది. సివిల్, మెకానికల్ వంటి కోర్ గ్రూపులను తీసుకునేందుకు విద్యార్థులు ఇష్టపడకపోవడంతో సిఎస్ఇ, ఇసిఇ, ఐటి బ్రాంచ్‌లకు మరింత డిమాండ్ పెరిగింది. దీంతో మేనేజ్‌మెంట్ కోటాలో సీట్లకు భారీగా వసూళ్లు సాగాయి. వెబ్ ఆప్షన్లలో మొదటి ఆప్షన్‌గా సాఫ్ట్‌వేర్ సంబంధిత బ్రాంచ్‌లను నమోదు చేసుకోవాలని విద్యార్థులు ఆలోచన చేస్తున్నారు. జిల్లాలోని 14 కాలేజీల్లోని 14,600 సీట్లకు జిల్లాలోని విద్యార్థులతోపాటు ఇతర జిల్లాల విద్యార్థులు పోటీ పడనున్నారు.

బెంబేలెత్తిస్తున్న ఫీజులు

ఇంజినీరింగ్ కాలేజీలకు సంబంధించి ట్యూషన్ ఫీజు కాలేజీ అర్హతను బట్టి రూ.43 వేల నుంచి రూ.లక్షా ఐదు వేల వరకూ ఉంది. తెల్లరేషన్ కార్డు ఉన్న విద్యార్థులకు ట్యూషన్ ఫీజును ప్రభుత్వం చెల్లిస్తోంది. హాస్టల్ ఫీజు, ఇతర ఫీజులు తల్లిదండ్రులే చెల్లించాలి. హాస్టల్ ఫీజు ఏడాదికి రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకూ కాలేజీలు వసూలు చేస్తున్నాయి. ప్లేస్‌మెంట్ ట్రైనింగ్, ఇతర ఫీజుల కింద మరో రూ.25 వేలు గుంజుతున్నారు. ట్యూషన్ ఫీజు ప్రభుత్వం చెల్లించినా ఏడాదికి అదనంగా రూ.లక్షకుపైగా చెల్లించాల్సి ఉంటుంది. ఏడాదికి రూ.లక్షకుపైగా కట్టాలంటే సామాన్య ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము సక్రమంగా ఇవ్వకపోవడంతో ఆ భారం సైతం తల్లిదండ్రులపై పడుతోంది. దీంతో ఇంజినీరింగ్ విద్య సామాన్యులకు బహుభారంగా మారుతోంది. కౌన్సెలింగ్ సమయంలో ప్లేస్‌మెంట్లు గురించి తెగ ఊదరగొడుతున్న కాలేజీలు నాలుగేళ్ల తర్వాత విద్యార్థులను ఒట్టిచేతులతో పంపిస్తున్నాయి. దీంతో ఇంజినీరింగ్ పూర్తి చేసి బయటికి వచ్చిన తర్వాత కోర్సులు నేర్చుకుని జాబ్ తెచ్చుకునేందుకు రెండేళ్లపైనే పడుతోంది. చాలామంది తమ చదువుకు సంబంధం లేని జాబ్‌లు చేస్తున్న పరిస్థితి ఉంది. సాధారణ డిగ్రీలు చదివితే ఉపాధి అవకాశాలు తక్కువగా ఉన్నాయనే కారణంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఎక్కువగా ఇంజినీరింగ్ విద్యపై మొగ్గుచూపుతున్నారు.

9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం రైల్వే గూడ్స్‌షెడ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) సర్వసభ్య సమావేశం సోమవారం స్థానిక రైల్వే గూడ్స్‌షెడ్ ఆఫీసు వద్ద సత్తి కోదండరామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని కోరుతూ తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని నినదించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుండి కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చడాన్ని ఖండించారు. యజమానులకు అనుకూలంగా లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్మికులను కష్టాల పాల్జేయడం దారుణమన్నారు. సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు అమలైతే సంఘం పెట్టుకునే హక్కుతోపాటు సమ్మె హక్కు, రెండేళ్లకోసారి చేసుకునే వేతన అగ్రిమెంట్ వంటివన్నీ పోతాయన్నారు. యూనియన్ కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను బడా కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా కట్టబెడుతున్నారన్నారు. కార్యక్రమంలో కర్రి సాయిరెడ్డి, కర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల నారాయణ, అడపా ఆంజనేయులు, ఎస్‌విఎస్.రెడ్డి, గాది వెంకట్రావు, మద్దాల పుత్రయ్య, బుద్దాల నాని, ఎ.కృష్ణ, జి.నాగబాబు, సత్తి దుర్గారెడ్డి, రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

సైకిల్ ర్యాలీ

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన పట్టణంలో సోమవారం మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనం నుండి ప్రారంభమైన ర్యాలీ పెంటపాడు వరకు సాగింది. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు జవ్వాది శ్రీను, సత్తి కోదండరామిరెడ్డి, బంకురు నాగేశ్వరరావు, శిద్ధిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, నరమాల కృష్ణ, వర్రి అప్పారావు, దేశంశెట్టి సతీష్, అన్నం చిన్నారావు, వడిసెల శ్రీను, పక్కుర్తి చిన్న అప్పారావు, పతివాడ నాగేంద్రబాబు పాల్గొన్నారు.



తణుకు ర్యాలీలో నినదిస్తున్న నేతలు

ఆకివీడు: ఈ నెల 9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు ఉద్యోగ సిబ్బందిని కోరారు. సోమవారం స్థానిక పోస్టాఫీస్‌లో ఆ శాఖ సిబ్బందికి సమ్మె కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ అధ్యక్షులు పెంకి అప్పారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నగదు బదిలీలను ప్రభుత్వ బ్యాంకులకు, పోస్టాఫీస్‌లకు కాకుండా ప్రయివేట్ బ్యాంకులకు బదిలీ చేసి ఆ బ్యాంకుల అభివృద్ధికి తోడ్పడటం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తణుకు: కార్మికులకు తీవ్ర హాని కలిగిస్తూ మోడీ తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు, 12 గంటల పని విధానం రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 9న కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యాన జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు కార్మికవర్గం అవిశ్రాంత పోరాటాలకు పూనుకోవాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో సిఐటియు నాయకులు ఎ.అజయకుమారి, పిఎల్.నరసింహారావు, ఎం.రమేష్, గుబ్బల గోపీ, బళ్ల చినవీరభద్రరావు, గార రంగారావు, వి.రమేష్, గోవిందరాజు, బ్రహ్మజీ, రామకృష్ణ, అయ్యప్ప, ఎఐటియుసి నాయకులు బొద్దాని నాగరాజు, చిక్కాల దుర్గాప్రసాద్, ఎన్.ఫణీంద్ర, కురెళ్ల శ్రీనివాస్, కొంబత్తుల రవికుమార్ పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో మోటారు సైకిల్ ర్యాలీ

గణపవరం: లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు సీనియర్ నేత చింతకాయల బాబూరావు, జిల్లా నేత డి.కళ్యాణి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఐటియు మండలాధ్యక్షులు ఎం.పెంటారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్పొరేట్ సంస్థలకు వ్యవసాయ రంగాన్ని అప్పగించడానికి ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.ఝాన్సీ, ఎండి.హసీనాబేగం, ఆశా వర్కర్ల నేతలు ఆర్.వెంకటరమణ, ప్రజాసంఘాలు నేతలు చిన్నం చిన నాగేశ్వరరావు, ఎస్తేరు సుజాత పాల్గొన్నారు.

నరసాపురం: ఆక్వారంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక వెల్కమ్ సీఫుడ్ ఫ్యాక్టరీలో రొయ్యల వలుపు మహిళా కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ నెల 9న సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కోడి లక్ష్మణ్, కోరాడ బద్రి, వంగ దుర్గాప్రసాద్, పైలా సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

9న సమ్మెకు బ్యాంక్ యూనియన్ల మద్దతు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఈ నెల 9న దేశవ్యాప్త సమ్మెకు బ్యాంకు యూనియన్లు సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు తాడేపల్లిగూడెం బ్యాంక్ ఉద్యోగుల కోఆర్డినేషన్ కమిటీ పేర్కొంది. జాతీయ బ్యాంకులను, దేశ ఆర్థిక సమగ్రాభివృద్ధికి తోడ్పడుతున్న ప్రభుత్వ బ్యాంకులను మరింత బలోపేతం చేయాలని, ఐడిబిఐ బ్యాంకులో ప్రభుత్వ వాటా 51శాతానికిపైగా కొనసాగించాలని, గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ బ్యాంకులను విస్తరించాలని, జాతీయ బ్యాంకుల్లో స్టాఫ్ రిక్రూట్‌మెంట్ అమలు చేసి ఉద్యోగులపై అదనపు ఒత్తిడి తగ్గించాలని, జాతీయ బ్యాంకుల సిబ్బంది సర్వీసు నిబంధనల్లో ప్రభుత్వ జోక్యం ఆపాలని, పని గంటల పెంపు ఉపసంహరించుకోవాలని కమిటీ కోరింది. ప్రకటన విడుదల చేసిన వారిలో యూనియన్ల నేతలు ఏడుకొండలు, లింగంపల్లి గాంధీ, బి.దివ్యరజనీ, చైతన్య, పాలూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

సమ్మెకు ఎస్ఎఫ్ఐ మద్దతు

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 9న సార్వత్రిక సమ్మెకు ఎస్ఎఫ్ఐ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.గణేష్, టి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు మానుకుని, రాజ్యాంగానికి అనుగుణంగా పరిపాలన నిర్వహించాలన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తహశీల్దార్

ప్రజాశక్తి - ఆచంట

ఎగువున కురుస్తున్న అధిక వర్షాల కారణంగా రాగల మూడు రోజుల్లో గోదావరికి వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ జి.కనకరాజు హెచ్చరించారు. గోదావరి నుంచి 9 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు వదులుతున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గోదావరి పరివాహక ప్రాంతాధికారులు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అధికారులు అందరూ అందుబాటులో ఉండి వరద పరిస్థితిని సమీక్షించాలని కోరారు.

దూర ప్రాంత విద్యార్థులకు రవాణా భత్యం

ఎంఇఒ-2 నాగేశ్వరరావు

ప్రజాశక్తి - పెనుమంట్ర

దూర ప్రాంతాల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థులకు రవాణా భత్యం ఇస్తున్నట్లు ఎంఇఒ-2 ఉండ్రాల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఈ భత్యం పొందటానికి ప్రభుత్వం కొన్ని అర్హతలు నిర్దేశించిందని అన్నారు. విద్యార్థి ఇంటికి, ప్రభుత్వ పాఠశాలకు కనీసం కిలోమీటరు కంటే ఎక్కువ దూరం ఉన్న ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు రవాణా భత్యం అందిస్తారని తెలిపారు. ఆదేవిధంగా 6, 7, 8వ తరగతి విద్యార్థులు ఈ రవాణా భత్యం పొందాలంటే స్కూలుకు, వారి ఇంటికి కనీసం 3 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ఉండాలన్నారు. ఈ విద్యార్థులకు నెలకు రూ.600 చొప్పున మూడు నెలలకు ఒకేసారి రూ.1800 ప్రభుత్వం అందజేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ భత్యం దూర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

స్విమ్మింగ్ పూల్‌కు రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పాటుపడుతున్న ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌కు పట్టణ అభివృద్ధిలో భాగంగా స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి సోమవారం స్థానిక జనసేన పార్టీ క్యాంపు కార్యాలయంలో వెజ్జు దుర్గాప్రసాద్ నాయుడు లక్ష రూపాయల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలో ప్రజలు, దాతల సహకారం మరువలేనిదని తెలిపారు. స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి ఆర్థిక సాయం అందించిన వెజ్జు దుర్గాప్రసాద్ నాయుడిని ఎంఎల్ఎ అభినందించారు. కార్యక్రమంలో కురిమెళ్ల అనిల్, పాలూరి వెంకటేశ్వరరావు, పుల్లా బాబి, కాంట్రాక్టర్ శివ, పాలూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్ పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం సచివాలయం - 3 డిజిటల్ అసిస్టెంట్ రాజేష్‌పై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు యండమూరి సుబ్బారావు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం ఫిర్యాదు చేశారు. తన మనవడు ఆధార్ కార్డు అప్‌డేట్ చేయాలని డిజిటల్ అసిస్టెంట్‌ను కోరగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్‌డేట్ అర్జంట్ అని కోరగా నేను ఇక్కడ నుండి ట్రాన్స్‌ఫర్ అయిపోయానని, దుకాణం సర్దేసాను, నేనేం చేయనంటూ సమాధానం చెప్పారని తెలిపారు. సదరు డిజిటల్ అసిస్టెంట్ సక్రమంగా విధులు నిర్వర్తించడే ఆరోపణలు ఉన్నాయన్నారు.

హరిబాబుకు కోడి రామకృష్ణ యువ ప్రతిభ అవార్డు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నటీనట సమాఖ్య అధ్యక్షుడు గుడాల హరిబాబుకు ప్రతిష్ఠాత్మక కోడి రామకృష్ణ యువ ప్రతిభ అవార్డు దక్కింది. ఆయన వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగం చేస్తూ ఎందరో సామాన్య ప్రజలకు సేవ చేస్తున్నారు. నటీనట సమాఖ్య తరఫున ఎన్నో ప్రదర్శనలు వేసి పాలకొల్లు పేరు నిలబెట్టారు. ఆయన చేసిన సేవలకు ఈ నెల 23న హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో తుమ్మలపల్లి రామ సత్యనారాయణ అధ్యక్షతన హరిబాబు అవార్డు తీసుకోనున్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు, పలు పార్టీల నేతలు, పలువురు కళాకారులు హరిబాబును అభినందించారు.

బాధితునికి సాయం

ప్రజాశక్తి - నరసాపురం

తనకు ప్రతి నెలా వచ్చే గౌరవ వేతనాన్ని అనారోగ్య సమస్యలతో బాధపడే నిరుపేద కుటుంబాలకు చాగంటి ఉమా నాయుడు ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా ఉపయోగిస్తానని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ (చిన్న) తెలిపారు. పట్టణానికి చెందిన ఆత్మూరి కిషోర్ జబ్బల అనారోగ్యానికి గురై రెండు కిడ్నీలు పాడైపోయి బాధపడుతున్నారు. సోమవారం కిషోర్‌కు చాగంటి చిన్నా కలిసి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా చిన్నా మాట్లాడుతూ కిషోర్ కుటుంబానికి అండగా ఉండి ప్రభుత్వ సహాయం అందించేలా కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట యడ్లపల్లి చిట్టి బాబు, చాగంటి రామాంజనేయులు, బాబి, వెంకటరావు, బల్ల శ్రీను, తెలగాశెట్టి నాగ సత్యనారాయణ, గంజి సూర్య తమ్మాజీ, కొనిశెట్టి సతీష్, కొనిశెట్టి నారాయణరావు, ఆకన శివప్రసాద్ ఉన్నారు.

బిఎల్‌ఒలకు ప్రత్యేక అధికారి సూచనలు

ప్రజాశక్తి - ఉండి

ఓటు నమోదు ప్రక్రియపై బూత్ లెవెల్ అధికారులకు జిల్లా పంచాయతీ అధికారి, ఉండి అసెంబ్లీ నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎన్.రామనాథరెడ్డి పలు సూచనలు ఇచ్చారు. సోమవారం ఉండి ప్రభుత్వ ప్రాథమిక శిక్షణ సంస్థలో ఆసెంబ్లీ మాస్టర్ ట్రైనర్ కడలి విజయ్ కుమార్ అధ్యక్షతన బూత్ లెవెల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఓటు నమోదు ప్రక్రియలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసుకోవడానికి అవగాహన కల్పించాలన్నారు. ఓటు నమోదులో తప్పు, ఒప్పుల సవరణ, చిరునామా మార్పు వంటి వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. పోలింగ్ స్టేషన్లో మరణించిన వ్యక్తి లేదా పెళ్లి చేసుకుని వేరే ఊరు వెళ్లిన వ్యక్తుల ఓటును తొలగించడానికి సర్వే చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామనాథరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల చట్టం ప్రకారం బిఎల్‌ఒల విధులు, బాధ్యతలు, పాత్రలు తెలియజేసేందుకు ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ రత్నకుమార్ మాట్లాడుతూ నేడు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి 48 మంది బిఎల్‌ఒలు హాజరు కావాల్సి ఉండగా 40 మంది హాజరయ్యారని తెలిపారు. మిగిలిన ఎనిమిది మందికి షోకాజ్ నోటీసులు అందజేశామన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న బిఎల్‌ఒలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉండి తహశీల్దార్ నాగార్జున, పాలకోడేరు తహశీల్దార్ ఎన్.విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

కల్లు అమ్ముడుపోక కార్మికుల అవస్థలు

తణుకు:గ్రామాల్లో బెల్ట్ షాపులు విచ్చల విడిగా ఏర్పాటు చేయడం వల్ల కల్లు గీత కార్మికులకు కల్లు అమ్ముడుగాక పస్తులతో కాలం గడుపుతున్నారని గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి అన్నారు. సోమవారం కలెక్టరుకు చెప్పుకుందాం రండి కార్యక్రమంలో గీత కార్మికులు, వారి కుటుంబాలు పాల్గొనాలని తేతలి గ్రామంలో గీత కార్మికులను కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ జిల్లాలో సుమారు 4 వేల బెల్ట్ షాపులు ఏర్పాటు చేయడంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు ఒకటిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. గీత కార్మికులు ప్రతీ సంవత్సరం నాలుగు మాసాలు నిర్వహించుకునే వృత్తిని మిగిలిన 8 మాసాలు పస్తులతో కాలం గడపాలని తెలిపారు. పర్స్ పాలిటీ ప్రభుత్వం ఫెడరేషన్ ఏ విధంగా రూ.20 వేలు ఇస్తున్నారో గీత కార్మికులకు అదే మొత్తంలో ఇవ్వాలన్నారు. గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 14వ తేదిన గీత కార్మికులు కలెక్టరేట్‌కు రావాలని సమస్యలను కలెక్టర్‌కు వివరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గీత కార్మికులు కాసాని శ్రీనివాసు, కట్టా శ్రీరామమూర్తి, సీతారామయ్య, అంగర పోతురాజు, చేబ్రోలు రాజు, ఆరేపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శ్రీనగరేశ్వర కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

పెనుగొండ : శ్రీనగరేశ్వర కాలనీలో సమస్యలు పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద కాలనీ వాసులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి షేక్ పాయిషా ఎండీఖ, సూర్యనారాయణ, తహశీల్దార్ అనితకుమారికి వినతిపత్రం సమర్పించారు. కాలనీలో డ్రైనేజీ, రోడ్లు లేనందున తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎంఎల్ఎ కాలనీకి వస్తారని, దుస్తారని, సదుపాయాలు కల్పిస్తారని అధికారులు చెబుతున్నారు తప్ప సమస్య పరిష్కారం కావడం లేదని తెలిపారు. అనంతరం పెనుగొండ బజార్ రోడ్డు మీదుగా గాంధీ బొమ్మ సెంటర్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. గుంతలు పూడ్చాలని, గ్రావెల్ రోడ్లు వేయాలని, వీధిలైట్లు వెలిగించాలని, స్వచ్ఛమైన తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.వెంకటేశ్వర్లు, మామను నాగేశ్వరరావు శ్రీసంపత్ వినాయక సంక్షేమ సంఘం అధ్యక్షులు చిట్టూరి శ్రీనివాస్, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

వైసిపి హయాంలో పంట కాలువలు నిర్లక్ష్యం

గోస్తనీలో కిక్కిస తొలగింపు ప్రారంభించిన ఎంఎల్ఎ రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

గత ఐదేళ్ల వైసిపి హయాంలో కనీసం గుర్రపు డెక్క, తొలగింపు, కాలువల ప్రక్షాళన చేపట్టకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం వేల్పూరు నుంచి పెనుమంట్ర మండలం ఎస్.ఇల్లిందలపర్రు వరకూ గోస్తనీని ప్రధాన పంట కాలువలో పేరుకుపోయిన కిక్కిస తొలగింపు కార్యక్రమాన్ని ఎంఎల్ఎ ప్రారంభించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంట కాలువల ప్రక్షాళన కోసం ప్రణాళికలు సిద్ధం చేసి రైతులకు మేలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రైతు సంక్షేమానికి కట్టుబడిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. నీటి సంఘాల ఎన్నికలు జరిపి కిందిస్థాయిలో నీటి సంఘాల సభ్యుల నుంచి జిల్లా స్థాయిలో పిసి ఛైర్మన్ వరకూ పంట కాలువలు, డ్రెయినేజీల ప్రక్షాళన చేసే గుర్రపుడెక్క, కిక్కిస తొలగించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పీసీ ఛైర్మన్ మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో కిక్కిస తొలగింపు కోసం ప్రత్యేక ప్రణాళికలు చేపట్టామన్నారు. ఆచంట నియోజకవర్గ యువ నాయకులు పితాని వెంకట్, నీటి సంఘం అధ్యక్షులు దొమ్మేటి భాస్కరరావు, ఇరిగేషన్ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుమంట్ర:గత సార్వా పంటలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని రైతులకు సాయం చేయాలని ధృక్పథంతో ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ, తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ చొరవతో జిల్లా వాటర్ డిస్ట్రిబ్యూటరీ సంఘం నిధులతో గోస్తానీ నదిలోని కిక్కిస తొలగింపు పనులకు శ్రీకారం చుట్టారు. వేల్పూరు నుండి మామిడూరు వరకు గోస్తానీలో పెరిగిపోయిన కిక్కిస గుర్రపు డెక్కను తొలగించి ఎగువ నుండి దిగువకు మురుగునీరు వచ్చే విధంగా పనులు చేపడుతున్నామని దీంతో ముంపు సమస్య తప్పుతుందని వారు తెలిపారు.

వరదలు, తుపాన్లు ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలి

ప్రజాశక్తి - భీమవరం

గతంలో అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో భారీ వర్షాలు, వరదలు, తుపాన్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ముందస్తుగా బలహీనంగా ఉన్న కాలువ గట్లు, నదీ పరివాహక ప్రాంతం గట్లను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. రహదారులు భవనాలు శాఖ బలహీనంగా ఉన్న బ్రిడ్జిలు, రోడ్డు మార్గాలు గుర్తించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. అధిక వర్షాలు, వరదలు టైంలో బోట్లు తిరగడం, ఘాట్ లోనికి ప్రజలు వెళ్లకుండా కట్టుదిట్టం చేయాలన్నారు. జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, డిపిఒ, డిఎఒ, ఇరిగేషన్, సివిల్ సప్లయిస్, అగ్నిమాపక, వైద్య, విద్యా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిపిఎం మాజీ సభ్యురాలు శకుంతల మృతి

ప్రజాశక్తి - వీరవాసరం

సిపిఎం మాజీ సభ్యురాలు నేతల శకుంతల (75) సోమవారం తెల్లవారుజామున అనారోగ్యంతో ఆమె స్వగృహం మత్స్యపురిపాలెంలో మృతి చెందారు. ఆమె మత్స్యపురిపాలెంలోని పార్టీ సీనియర్ నాయకుల నేతల ఆనందరావు భార్య. వారికి ఇద్దరు కుమార్తెలు. శకుంతల తన భర్తతోపాటు అనేక పార్టీ కార్యక్రమాల్లో, పోరాటాల్లో చురుగ్గా పాల్గొనేవారు. శృంగవృక్షం ఏరియాలో జరిగిన కూలి రేట్ల పోరాటాల్లో తన భర్త ఆనందరావుతో పాటు పాల్గొనేవారు. అలాగే భర్తతో వ్యవసాయ కార్మిక సంఘంలో చురుగ్గా పాల్గొని పనిచేసేవారు. ఆనందరావు రెండేళ్ల క్రితమే అనారోగ్యంతో మరణించారు. వీరి కుటుంబం పార్టీ కార్యకర్తలకు నిలయంగా ఉండేది. శకుంతల మృతి వార్త తెలియగానే సిపిఎం సీనియర్ నాయకులు జక్కిన నరసింహమూర్తి, మండల నాయకులు బొర్రా అలమహరాజు, యండమూరి సుబ్బారావు, ఎన్.ఆత్రెయ, కొలికలపూడి శ్రీనివాస్, మైగాపుల త్రిమూర్తులు తదితరులు ఎర్రజెండా కప్పి ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, బి.బలరాం, జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, వారి కుటుంబానికి సంతాపం వ్యక్తం చేశారు.

రైతులు క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలి

ప్రజాశక్తి - ఆచంట

ప్రకృతి వైపరీత్యాల వల్ల వచ్చే నష్టపరిహారానికి రైతులు క్రాప్ ఇన్సూరెన్స్ ప్రీమియంను ఆగస్టు 15వ తేదీలోగా చెల్లించుకోవాలని కొడమంచిలి సొసైటీ కార్యదర్శి కె.నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం కొడమంచిలి సొసైటీ కార్యాలయంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకానికి సంబంధించి బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ భూమి కలిగిన రైతులు, కౌలు రైతులు విధిగా క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ లేదా 1బి, ఇ-పంట సర్టిఫికెట్, ఆధార్ బ్యాంక్ పాస్ పుస్తకం జిరాక్స్ తీసుకురావాలన్నారు. ఖరీఫ్ సీజన్లో వరికి ఎకరానికి రూ.210 చొప్పున చెల్లించాలన్నారు. ఎకరానికి రూ.44 వేలు నష్టపరిహారంగా బీమా వర్తిస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వీరవాసరంలో స్వచ్ఛ సర్వేక్షన్ బృందం పరిశీలన

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరంలో స్వచ్ఛ సర్వేక్షన్ బృందం సోమవారం పర్యటించింది. స్వచ్ఛ సర్వేక్షన్ దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా వీరవాసరం పరిశీలనా గ్రామంగా ఎంపికైంది. ఇందులో భాగంగా సంబంధిత బృందం గ్రామంలో పర్యటించి నిర్వహించిన నిబంధనలకులోబడి పరిశీలించింది. స్వచ్ఛ సర్వేక్షన్‌కు ఎంపికైన గ్రామాలకు కేంద్ర ప్రభుత్వం నిధులతో గ్రామంలో కొన్ని ప్రయోజనాలు కలిగే అవకాశం ఉంది. ఈ పరిశీలనలో ముందుగా ఎంపిక చేసిన గృహాల్లో, పిహెచ్‌సి, మార్కెట్, దేవాలయాలు, సామూహిక మరుగుదొడ్లు, మురుగునీరు పారుదల సదుపాయాలు, పాఠశాలలలో పారిశుధ్య నిర్వహణ పరిశీలించారు. ఈ బృందంలో జిల్లా పరిశీలకులు ఎం.మధుమిత, పి.సత్తిబాబు, ఎం.శరత్‌కుమార్ ఉన్నారు. వీరి వెంట ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కనకరావు, కార్యదర్శి లక్ష్మీ, ఎన్ఆర్ఇజిఎస్ టిఎ వర్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొప్పర్రులో 'సుపరిపాలనలో తొలిఅడుగు'

ప్రజాశక్తి - నరసాపురం

ఎన్నికల్లో ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చే దిశగా పాలన సాగుతోందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు పొత్తూరి రామరాజు, మత్స్యకార సహకార సమైఖ్య రాష్ట్ర ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు తెలిపారు. సోమవారం కొప్పర్రులో సుపరిపాలనపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాలను వివరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది కూటమి పాలనపై ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారన్నారు. రానున్న రోజుల్లో మరింత మంచి పాలన అందించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సావిత్రి, ముక్కు బాబూరావు, రామానందం, పోతుమూడి ముసలయ్య, శేషారావు పాల్గొన్నారు.

ఆనందరాజు మృతితో గణపవరంలో విషాదఛాయలు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం గ్రామానికి చెందిన వేగేశ్న ఫౌండేషన్ అధినేత వేగేశ్న ఆనందరాజు మృతి చెందడంతో గణపవరంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానిక వేగేశ్న దాత రాజు పెద్ద కుమారుడు ఆనందరాజు ఆయన తమ్ముడు వేగేశ్న కోటి రాజు కూడా అమెరికాలో ఉంటూ గణపవరం ప్రాంత ప్రజలకు కనీస అవసరాలు తీర్చడానికి కృషి చేస్తున్నారు. ఆనందరాజు వేగేశ్న ఫౌండేషన్ ఏర్పాటు చేసి దేశంలో ప్రముఖ దేవస్థానాల్లో తాగునీటి వసతిని ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చుతున్నారు. గణపవరంలో ఇందిరమ్మ కాలనీ వాసుల కోసం రూ.35 లక్షలతో 1,250 మందికి ఇళ్ల స్థలాలు కొని ఇచ్చారు. పెద్దతిరుపతి వెంగ మాంబ ఆలయం వద్ద యాత్రికుల కోసం రూ.77 కోట్లతో భవనాలు నిర్మించారు. ఈ ఏడాది గణపవరంలో, జగన్నాథపురంలో తాగునీటి కోసం ఐదెకరాలు రూ.నాలుగు కోట్లతో కొనుగోలు చేశారు. దేశంలో అన్ని దేవాలయాల్లో వేగేశ్న ఫౌండేషన్ ద్వారా నిరంతరం అన్నదానాలు జరుగుతున్నాయి. ఆనందరాజు అనారోగ్యంతో మద్రాసు ఆసుపత్రిలో ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. ఆయన మృతి పట్ల నడంపల్లి సోమరాజు ఉంగుటూరు మాజీ శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు, కర్ర శ్రీనివాస్, ఎన్.శ్రీరామరాజు, వేగేశ్న సుబ్బరాజు, ఆర్‌విఎస్.రాజు, వి.ప్రసాద్‌రాజు సంతాపం తెలిపారు. ఆనందరాజు మరణంతో గణపవరం పరిసర ప్రాంతాల విషాదఛాయలు అలుముకున్నాయి.

మోకులతో కదలిరండి

కార్మికులకు కల్లుగీత కార్మిక సంఘం పిలుపు

ప్రజాశక్తి - ఆకివీడు

ముఖ్యమంత్రి ఆదేశాల అమలు కోసం జిల్లా కలెక్టర్‌ను కోరుదామని, గీత కార్మికులు మోకులు ధరించి కదలిరావాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.వంటి, జిల్లా ఉపాధ్యక్షులు కడలి పాండు పిలుపునిచ్చారు. ఈనెల 14న జిల్లాలోని కల్లు గీత కార్మికులు జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరనున్నామని తెలిపారు. ఈ మేరకు జిల్లా మొత్తం ప్రచారం చేస్తున్నామన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆకివీడులో ఎక్సైజ్ సర్కిల్ గీత కార్మికుల సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షులు కాగిత రాధాకృష్ణ అధ్యక్షతన సమావేశం జరిగింది. మాట్లాడుతూ బెల్ట్ షాపులు పెడితే బెల్ట్ తీస్తామని ముఖ్యమంత్రి, బెల్ట్ షాపులపై కొరడా ఝుళిపిస్తామని ప్రకటించారన్నారు. ఈ ఆదేశాలు ఎందుకు అమలు జరపడం లేదో జిల్లా కలెక్టర్ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రణాళికలో గీత కార్మికులకు 340 మద్యం షాపులు ఇస్తామని ఊదరగొట్టారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత గీత కార్మికులకు మొండి చేయి చూపారన్నారు. ఈ సమావేశంలో షేక్ వలీ, మామిడిశెట్టి సత్యనారాయణ, వంకా సత్యనారాయణ, మాన్యం వెంకటేశ్వరావు, బొల్లా శ్రీనివాస్, పడమట సహదేవుడు, ముద్దే వెంకటేశ్వరావు, సెనగల వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బాధితులకు సెల్‌ఫోన్లు అందజేత

ప్రజాశక్తి - భీమవరం టౌన్

చోరీలకు గురైన ఫోన్లను రికవరీ చేసి సంబంధిత వ్యక్తులకు సోమవారం జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి ఆయన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్లు పోయిన బాధితుల ఫిర్యాదు మేరకు 208 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించినట్లు తెలిపారు. వీటి విలువ రూ.31,20,000 ఉంటుందని తెలిపారు. ఇప్పటివరకూ 10 దఫాలుగా మొత్తం 1612 సెల్ ఫోన్లో రికవరీ చేశామని, వీటి విలువ రూ.రెండు కోట్ల 40 లక్షల 30000 ఉంటుందన్నారు. అయితే సెల్‌ఫోన్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, తెలియని వారి దగ్గర సెకండ్ హ్యాండ్ సెల్‌ఫోన్ కొనుగోలు చేయకూడదని తెలిపారు. ఈ మేరకు సిఐ ఎండి అహ్మద్ ఉన్నీసా, ఎస్ఐ నాగేశ్వరరావు సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

నిర్దేశిత గడువులోగా ఫిర్యాదులు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నరసాపురం

పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆర్‌డిఒ దాసిరాజు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమంలో 51 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించామని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార విధానం ద్వారా స్వీకరించిన అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: స్థానిక మున్సిపల్ ఆఫీస్ వద్ద సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 14 అర్జీలు స్వీకరించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు తెలిపారు. టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి 5, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 8, పెన్షన్ కోసం ఒకటి మొత్తం 14 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎం.ఏసుబాబు, మున్సిపల్ ఇంజినీర్ వై.రమణ, అసిస్టెంట్ కమిషనర్ డి.రవికుమార్, ఎస్‌పి జి.సీతారాం, మేనేజర్ పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరు లోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఐదు వినతులు అందాయని తహశీల్దార్ కిషోర్ తెలిపారు. భూ సర్వే నిర్వహించాలని కోరుతూ రెండు, పట్టాదార్ పాస్ పుస్తకం కోసం ఒకటి, రామన్నపాలెం, కెపి.పాలెం సౌత్ గ్రామాల్లో డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని కోరుతూ ఒక్కో వినతి అందిందని తెలిపారు.

ఘనంగా మందకృష్ణ మాదిగ పుట్టినరోజు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని, మంద కృష్ణమాదిగ పుట్టినరోజు వేడుకలను ఎంఆర్‌పిఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. నరసాపురం నియోజకవర్గం ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా మొగల్తూరు, నరసాపురం పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో అంబేద్కర్ సెంటర్‌లో అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఆరోగ్య, విద్యాలయాలకు రూ.6000 పెన్షన్ వంటి అనేక ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు పేదలకు అందించాలని మంద కృష్ణ మాదిగ అనేక పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి గొల్లపల్లి శ్రీనివాస్, జిల్లా ప్రెసిడెంట్ యడ్లగడ్డ రత్నరాజు, గొరకపూడి దేవేంద్ర రాజు, చిక్కాల నాగ వాసు పాల్గొన్నారు.

మొగల్తూరు : ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలను మంగళవారం సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో మొగల్తూరులో ఎంఆర్‌పిఎస్ నాయకులు భారీ ప్రదర్శన చేశారు. గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన కేకును నాయకులు కోసి ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం ప్రదర్శనగా నరసాపురం బయలుదేరి వెళ్లారు.

తండ్రిపై కొడుకు దాడి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆస్తిని తనపేరు మీద రాయకుండా, మనవడి పేరుమీద రాస్తానన్న తండ్రిని గడ్డపారతో కొడుకు తీవ్రంగా గాయపర్చారు. సోమవారం ఉదయం ఈ సంఘటన మండలంలోని మల్లిపూడి గ్రామంలో జరిగింది. ఎస్ఐ కె.స్వామి తెలిపిన వివరాల ప్రకారం. మల్లిపూడి గ్రామానికి చెందిన గుడిమెట్ల కృష్ణారెడ్డి (71) ఆస్తిని కుమారుడు వెంకటరెడ్డి పేరు మీద కాకుండా మనవడి పేరు మీద రాస్తాననడంతో తండ్రిపై కక్ష పెంచుకుని గడ్డ పారతో దాడి చేసాడు. తీవ్రంగా గాయపడ్డ తండ్రి కృష్ణారెడ్డిని 108 వాహనంలో తణుకు గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి నిలకడగా ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, పిజిఆర్ఎస్ నోడల్ అధికారి వై.దోసిరెడ్డి, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ టి.శివన్నారాయణరెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 165 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజాసమస్యల పరిష్కారంపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారని, జిల్లా అధికారులు వారి శాఖల సంబంధించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్దేశ గడువులోగా తగ్రతతోనూ, నాణ్యమైన పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడి.వెంకటేశ్వర్లు, భీమవరం మున్సిపల్ సహాయ కమిషనర్ ఎ.రాంబాబు, డిపిఒ ఎన్.రామనాథ్‌రెడ్డి, డిఎంహెచ్‌ఒ జి.గీతాబాయి, వయోవృద్ధుల ప్రతినిధి మేళం దుర్గాప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు వింటున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

గ్రామ సచివాలయ సిబ్బందికి సత్కారం

ప్రజాశక్తి - కాళ్ల

ఐదేళ్ల పాటు గ్రామ సచివాలయంలో వివిధ శాఖల్లో విధులు నిర్వహించి వేరే గ్రామ సచివాలయానికి బదిలీపై వెళ్తున్న ఐదుగురు గ్రామ సచివాలయ సిబ్బందిని సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు ఐదేళ్ల పాటు గ్రామ సచివాలయ సిబ్బంది చక్కని సేవలందించారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇంగిలాల పద్మావతి, పంచాయతీ కార్యదర్శి సుంకర వెంకటేష్, ఇజిఎస్‌ఆర్‌డి ఎంవి.భాస్కరరావు, అభిరుచి కాశిరాజు, పంచాయతీ పాలకవర్గం పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
I.A. 1953/2024 in
ASSR No. 3064/2022
Between:
Association for Promoting Spiritual & Socio Economic Activities ...Petitioner
AND
Penumatsa Durga Prasad Raju, S/o. Satyanarayana Raju, Hindu, aged 63 years, Business, D.No. 26-1-12, Tanuku, W.G.Dist. ...Respondent
పై నెంబరు పిటిషన్‌లో రెస్పాండెంట్ అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా తప్పించుకు తిరుగుచున్నారు. కావున ది. 11-7-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 గం॥లకు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ అక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్ మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
జి.ఎస్.ఎస్.మురళీమోహన్
రాజమండ్రి ది.వి.రామలక్ష్మి
02-7-2025 అడ్వకేట్స్, రాజమండ్రి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పెనుమంట్ర పిహెచ్‌సి అధికారి టి.కిరణ్మయి అన్నారు. సోమవారం నత్తారామేశ్వరం గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో మొబైల్ వైద్య, ఆరోగ్య సేవా శిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఇక్కడ సుమారు 70 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి, అవసరమైన సలహాలు, మందులు అందజేశారు. స్థానిక ఎఎన్ఎం టి.వెంకటలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి ఎం. కుమారి పాల్గొన్నారు.

డిఎన్ఆర్‌లో బోధనకు అధ్యాపకులు కావాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ క్లాసులు బోధించేందుకు ఎంసిఎ లేదా ఎంఎస్‌సి కంప్యూటర్స్‌లో విద్యార్హత కలిగిన అభ్యర్థులు కావాలని కళాశాల ప్రిన్సిపల్ కోటగిరి ఉదయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

నేడు వైఎస్ఆర్ జయంతి

ప్రజాశక్తి - మొగల్తూరు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను మొగల్తూరులో మంగళవారం నిర్వహించనున్నామని వైసిపి పట్టణ అధ్యక్షులు కుక్కల కృష్ణమోహన్ తెలిపారు. ఈ వేడుకలకు వైసిపి జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజు హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

కారు బోల్తా

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని ఆలమూరు డ్రైనేజీ వద్ద సోమవారం మధ్యాహ్నం తాడేపల్లిగూడెం రోడ్డులో కారు బోల్తా పడింది. ఈ సమయంలో ఎటువంటి వాహనాలు అటుగా రాకపోవడం అందులో ఉన్న మార్టేరు గ్రామీణ పోలీస్ కోయ సత్యహరిత స్వల్ప గాయాలతో బయటపడినట్లు స్థానికులు తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సమాచారం.

ప్రకటన
ఆరసపల్లి శ్రీలక్ష్మి, భర్త: లేటు భాస్కరరావు, D.No. 16B-15-23 తంగెళ్ళమూడి, ఏలూరు పట్టణం, సెల్ నెం. 81211 26422 వారి సంజాయిషీ ప్రకారం ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూల్ ఆస్తి ఫ్లాట్ ఉన్న గాను ది. 27-03-2010న 1. కరుపాటి రామచంద్రరావు 2. వారి కుమారుడు వేణుగోపాలకృష్ణ 3. శివయ్యగారి గారికి క్రయ దస్తావేజు వ్రాయించి ఏలూరు సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయం నెం. 1202/1920 గా రిజిస్టర్ కాబడినది. దరిమిలా పరిశీలన దస్తావేజు ఏలూరు Ro.R లో 15 పుస్తకం 370 వాల్యూం 1711 పుటలలో డి.నెం. 3628/1928 ది. 27-03-2010 2339/2010 నెంబరు దస్తావేజు పోయినది. పోలీసు సర్టిఫికెట్ తీసుకొన్నాము. ఈ దిగువ ఆరసపల్లి శ్రీలక్ష్మి నా కుటుంబ బ్యాంక్ లోన్ కొరకు డి.నెం. 2339/2010 పోయినది. ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రస్‌కి తెలియపరచవలెను.
షెడ్యూలు
శ్రీ ఆరసపల్లిరాజుగారికి చెందిన ఏలూరు స్టీల్లోల ఫ్లాట్ నెం. 33 R.S.No. 442 లో 60 చ॥గజాలకు సరిహద్దులు:
తూర్పు : 33 అంగుళాల వెడల్పు గల రోడ్డు 30 అడుగులు
దక్షిణం : ఫ్లాటు నెంబరు 4 దాఖలా స్థలం 18 అడుగులు
పడమర : బరగడ సత్యం గారి భూమి 30 అడుగులు
ఉత్తరం : ఫ్లాటు నెంబరు 2 దాఖలా స్థలం 18 అడుగులు
ఏలూరు డి. శంకర్,
ది. 07-07-2025 అడ్వకేట్, ఏలూరు సెల్: 94405 02352

ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 6/2024
Between:
ఆరిటాకుల లీల సుమంత్ కుమార్ ...వాది
Vs
అదారి వరలక్ష్మి వగైరా ...ప్రతివాదులు
పై నెంబరు దావాలో మొదటి ప్రతివాది అదారి వరలక్ష్మి, భర్త: అదారి నాగులు, డోర్ నెం. 8-19-3/2, 16వ వార్డు, జువ్వలపాలెం, తాడేపల్లిగూడెం అను వారు పై నెంబరు దావాలో కోర్టు వారు ఎన్నిమార్లు దావా సమన్లు పంపినప్పటికీ తీసుకొనక avade చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు యీ ప్రకటన ఇవ్వడమైనది. కావున సదరు మొదటి ప్రతివాది అదారి వరలక్ష్మి, భర్త: అదారి నాగులు, డోర్ నెం. 8-19-3/2, 16వ వార్డు, జువ్వలపాలెం, తాడేపల్లిగూడెం అను వారు ది. 15-07-2025 వ సం॥రం తేదిన ఉదయం గం. 10-30 ని॥లకు పైన తెలిపిన కోర్టులో స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరు కాకపోయిన యెడల మీ పై ఏకపక్ష తీర్మానించబడునని తెలియపరచడమైనది.
టి. లీలా మాధవ్
తాడేపల్లిగూడెం పిటిషనరు తరపు న్యాయవాది
ది.06-07-2025 తాడేపల్లిగూడెం
సెల్ నెం: 93464 09563

In The Court Of The Civil Judge (Senior Division) - Tadepalligudem
E.P.No. 41/2023 in O.S.No. 157/2016
Between:
Karri Dana Reddy ...D.H.R
Vs
Katam Radha Krishna ...J.D.R
J.D.R : Katam Radha Krishna, S/o. Gavarayya, Near Ayyappa Vilas, Palabuchiyya Street, D.No. 2-16, Main Road, Tadepalligudem.
పై నెంబరు E.P గ్రంథములో శ్రీ కోర్టు వారు Sale నోటీసును పంపించినప్పటికిని మీరు తీసుకొనకుండా కాలయాపన చేస్తున్నందున శ్రీ కోర్టు వారు Substituted Service ద్వారా పేపరు పబ్లికేషన్ Sale నోటీసు ఆర్డరు చేసినందున ఈ పబ్లికేషన్ ద్వారా నోటీసు అందినట్లు నిమిత్తం ది. 11-07-2025 వ తారీకున ఉదయం గం. 10-30 ని॥లకు లాయరు పై కోర్టులో హాజరు కావలెను. లేనియెడల పరోక్షముగా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
Thota Ram Babu,
Tadepalligudem Advocate
Date: 03-07-2025 Vijaya towers Tadepalligudem
Cell: 98483 77437